సాక్షి ములుగు

శుక్రవారం | 30 | ఆగస్టు | 2024



స్వశక్తులు.. ఉపాధి కర్తలు

సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని స్వశక్తితో ఎదగడంతో పాటు లక్షలాది మందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణం అందజేస్తూ చేయూతనిస్తున్నాయి. - 8లో▸



2025 డిసెంబర్ నాటికి ‘దేవాదుల’

దేవాదుల ఎత్తిపోతల పథకం పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యంలో పెట్టింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$28^0/25^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సులపై ఓరుగల్లువాసుల ఆసక్తి

- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 2023 నుంచి ఇప్పటి వరకు 2,687 మందికి జారీ
- నగర పరిధి కావడంతో ఇక్కడి నుంచే విదేశాలకు యువత
- మిగతా నాలుగు జిల్లాల్లో తక్కువే

విదేశీ రోడ్లపై సేఫ్ డ్రైవింగ్



(వరంగల్ డెస్క్)

ఉన్నత చదువులకు, పర్యాటకం నిమిత్తం ఓరుగల్లు నుంచి అనేక మంది యువత విదేశాలకు వెళ్తుంటుంది. అక్కడ గమ్యస్థానాలను అన్వేషించాలంటే కారు ఉండాల్సిందే. కానీ డ్రైవింగ్ చేయాలంటే భారతీయ డ్రైవింగ్ లైసెన్స్ చెల్లుబాటు కాదు. ఇందుకు అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్ అవసరం. దీంతో విదేశాలకు వెళ్లేవారు కచ్చితంగా అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సులను తీసుకుంటున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాలనుంచి 2023, ఏప్రిల్ నుంచి ఈ నెల 29వ తేదీ వరకు 2,687 మందికి, జనగామలో 59, మహబూబాబాద్‌లో 284మందికి అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సులు జారీ అయ్యాయి.

ఐడీపీతో అనేక ప్రయోజనాలు..

అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సే అక్కడి డ్రైవింగ్ పర్మిట్ (ఐడీపీ)గా పరిగణిస్తారు. విదేశాల్లో అదనపు డ్రైవింగ్ పరీక్షలు అవసరం లేదు.. మీరు అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్‌ని కలిగి ఉన్నట్లయితే మీరు విదేశాల్లో జరిగిన ప్రమాదానికి బీమాను క్లెయిమ్ చేయవచ్చు. మనదగ్గర అందుబాటులో ఉన్నట్లు అక్కడ డ్రైవర్లు దొరకరు. ఉన్నా చాలా చార్జ్ చేస్తారు. అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్‌ని కలిగి ఉండడం వల్ల స్థానిక అధికారులతో ఇబ్బందులు పడకుండా విదేశీ రోడ్లు, హైవేలపై కార్లను అద్దెకు తీసుకుని నడపొచ్చు. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, స్వీడన్, సింగపూర్, దక్షిణాఫ్రికా, జర్మనీ, మలేషియా, ఫ్రాన్స్, న్యూజిలాండ్, యునైటెడ్ కింగ్‌డమ్ తదితర సుమారు 150దేశాల్లో మన అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సులు చెల్లుబాటు అవుతాయి. కాగా, మన వాహనాల్లో డ్రైవింగ్ సీటు కారుకు కుడివైపున ఉంటే విదేశాల్లో ఎడమవైపున స్టీరింగ్ ఉంటుంది. మన దగ్గర తీసుకున్న లైసెన్సు ఏడాదిపాటు చెల్లుబాటు అవుతుంది. ఆ తర్వాత ఆ దేశం నుంచి డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది.

దరఖాస్తు ఇలా..

ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్ కావాలంటే 18 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న భారతీయ పౌరుడు అయి ఉండాలి.

- ఫారం–4ఏతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆరోగ్య ధ్రువీకరణ పత్రం ఉండాలి. రవాణాశాఖ పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి.
- అందులో పేర్కొన్న సమయం ప్రకారం కార్యాలయానికి వెళ్లాలి.
- రూల్ 32 ప్రకారం యూజర్ చార్జీలు వసూలు చేస్తారు.
- స్థానిక డ్రైవింగ్ లైసెన్స్, తాజాగా తీసిన మూడు పాస్ ఫొటోలు, భారతీయ గుర్తింపు కార్డులు, పాస్‌పోర్ట్ కాపీ వెంట తీసుకెళ్లాలి.

ఇక్కడ కారు అత్యవసరం




నేను అమెరికా ఫ్లోరిడాలోని పెన్సకోలాలో ఉంటున్నా. భారతదేశంలో ఉన్నట్లు ప్రజారవాణా ఇక్కడ ఎక్కువ ఉండదు. ఎక్కడికి వెళ్లాలన్నా కార్లలోనే. క్యాబ్‌లో వెళ్దామంటే చార్జ్ ఎక్కువ తీసుకుంటారు. దూరప్రాంతాలకు వెళ్లాలంటే కార్లను అద్దెకు ఇస్తారు. మనం నేరుగా డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్లొచ్చు. ఆ సమయంలో అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్ అత్యవసరం. నేను అమెరికా వచ్చేముందు తీసుకున్నా. ఇక్కడ గుర్తింపుకార్డుగా కూడా పనికి వస్తోంది.

– జి.ప్రవీణ్‌రెడ్డి, వరంగల్

అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సుల జారీ ఇలా..

(2023, ఏప్రిల్ నుంచి ఈ నెల 29వ తేదీ (గురువారం) వరకు) జిల్లాల వారీగా...



నేడు జిల్లాలో మంత్రుల పర్యటన

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏజెన్సీలోని నేడు ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లో మంత్రులు పర్యటించనున్నారు. తాగు, సాగునీటి వనరులపై మంత్రులు ప్రత్యేక దృష్టి సారించనున్నారు. శుక్రవారం ఉదయం 9గంటలకు రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) జిల్లాకు చేరుకుంటారు. తొలుత జిల్లాలోని దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్‌కి సంబంధించిన పంపింగ్ స్టేషన్‌ను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై ఇంజినీర్లతో మంత్రులు సమీక్షను నిర్వహిస్తారు. తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజీ నుంచి దిగువకు విడుదలైన నీటి వివరాలు, బ్యారేజీలో నీటి నిల్వతో దేవాదుల పంప్‌హౌజ్‌కు నీటి లభ్యతతో పాటు తదితర అంశాలపై చర్చించనున్నారు. అలాగే ముంపు బాధితులు, అక్కడ నిరుపయోగంగా ఉన్న విద్యుత్ ఉత్పత్తి పనులపై చర్చించనున్నారు. గోదావరి, వాగుల ఆయకట్టు వివరాలపై తెలుసుకుని తక్షణ చర్యలు చేపట్టనున్నారు. అలాగే ఏటూరునాగారంలో జిల్లా పరిషత్ అదనపు భవన సముదాయం ప్రారంభోత్సవం, ఐటీడీఏలో వైద్యం, వ్యవసాయంపై సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అనంతరం ఏటూరునాగారం నుంచి వై జంక్షన్ వరకు సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించనున్నారు. మంత్రుల పర్యటన సందర్భంగా అడవులు, గ్రామాలను పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. హెలికాప్టర్‌లో మంత్రులు రానుండడంతో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ ఆదర్శం



ములుగు/ములుగు రూరల్/ఎస్ఎస్ తాడ్వాయి: భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ను విద్యార్థులు, క్రీడాకారులు, యువకులు ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. ఈ మేరకు జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర పాల్గొని ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్రీడల అధికారి తులరవి, కలెక్టరేట్ ఏఓ రాజ్‌కుమార్, డీపీఆర్‌ఓ రఫీక్, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ధ్యాన్‌చంద్ జయంతి వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశం మాట్లాడారు. భారత క్రీడారంగానికి ధ్యాన్‌చంద్ ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సోమన్న మాట్లాడుతూ 1928, 1932, 1936 ఒలంపిక్ క్రీడల్లో ధ్యాన్‌చంద్ భారత హాకీ జట్టులో ఆడి బంగారు పతకాలు తీసుకొచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు. ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన జయంతి వేడుకల్లో జిల్లా క్రీడల అధికారి యాలం ఆదినారాయణ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అజ్మీరా రవీందర్, జగపతిరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈసారి లేనట్లేనా?

హేమాచలక్షేత్రానికి పాలక మండలిని నియమించని ప్రభుత్వం

- పేరుగొప్ప ఊరుదిబ్బ అన్నచందంగా అభివృద్ధి
- ఆలయ పునరుద్ధరణ కమిటీకే పరిమితం



మల్లూరులోని శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

మంగపేట: రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధి గాంచిన మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానానికి పాలక మండలి ఏర్పాటు ఈ సారి కూడా లేనట్లేనా అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. పురాతన ఆలయానికి పాలక మండలి లేకపోవడంతో పాటు సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఆలయానికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలో నెలకొన్న పరిస్థితులను చూస్తుంటే పేరుగొప్ప–ఊరుదిబ్బ అన్నచందంగా మారింది. హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానానికి పూర్వం నుంచి రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటుందో అదే పార్టీకి చెందిన స్థానిక నాయకుల్లో ఒకరికి ఆలయ పాలకమండలి చైర్మన్‌గా మరో 13మందికి సభ్యులుగా 2016వరకు అవకాశం కల్పిస్తూ వచ్చారు. ఆదివాసీ గిరిజనులకు రాజ్యాంగంలో కల్పించిన హక్కుల మేరకు ఏజెన్సీ ప్రాంత పరిధిలో ఉన్న లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం పాలక మండలిలో చైర్మన్, సభ్యులుగా తమకు అవకాశం కల్పించాలని ఆదివాసీ గిరిజనులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంపై కోర్టు స్టే ఇవ్వడంతో 2017నుంచి ఆలయ పాలక మండలి ఏర్పాటు నిలిచిపోయింది. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిఏటా మే నెలలో జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాల(జాతర) సందర్భంగా 6 నెలల పదవీ కాలంతో ఆలయ పునరుద్ధరణ కమిటీ పేరుతో చైర్మన్, సభ్యులను ఆపార్టీకి చెందిన వారిని నియమిస్తూ వచ్చింది. 2024 ఏప్రిల్‌తో రెనోవేషన్ కమిటీ చైర్మన్, సభ్యుల పదవీకాలం అయిపోయి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ ఆలయ పునరుద్ధరణ కమిటీ ఏర్పాటు జరగలేదు. ప్రస్తుతం ఆలయ కార్యనిర్వహణ అధికారిగా శ్రావణం సత్యనారాయణ విధులు నిర్వహిస్తున్నారు.

26ఆలయాల్లో పాలకమండళ్ల ఏర్పాటుకు నోటిఫికేషన్

రాష్ట్ర వ్యాప్తంగా 26ఆలయాల్లో పాలకమండళ్ల ఏర్పాటుకు రాష్ట్ర దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యార్ జీఓ నంబర్ 299 జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎనిమిది దేవాలయాల్లో ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు కార్యనిర్వహణ అధికారులు బహిరంగ నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నోటిఫికేషన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండో యాదగిరి గుట్టగా ప్రసిద్ధిగాంచి, సిక్స్ ఏ టెంపుల్‌గా గుర్తింపు పొందిన మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం పేరు లేకపోవడంపై చర్చ సాగుతోంది.

అభివృద్ధి పనుల పేరుతో వసూళ్లు

ఆలయంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఆలయంలో పనిచేస్తున్న కొంతమంది వ్యక్తులు దాతల నుంచి లక్షల్లో వసూళ్లు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దేవాదాయశాఖ ఎలాంటి అనుమతి లేకుండా, ఆగమశాస్త్రం పాటించకుండా, స్తపతి అనుమతి లేకుండానే ఆలయ ప్రాంగణంలో ఉప ఆలయాల నిర్మాణం, ప్రత్యేక వసతి గదులు, అన్నదాన షెడ్‌లు, ఆర్చీలు ఇలా పలు రకాల పనుల నిర్మాణం పేరుతో దాతల నుంచి విరాళాలు సేకరించడం గమనార్హం. కనీసం ఏ పనికి ఏదాత ఎంత ఇచ్చారో తెలియక పోవడం ఇదంతా సంబంధిత అధికారులు చూసినా చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

కర్పూరంలా కరిగిపోతున్న ఆదాయం

హేమాచలక్షేత్రంపై గత ఎనిమిదేళ్ల నుంచి శాశ్వత ట్రస్ట్ బోర్డు చైర్మన్, సభ్యుల ఎన్నిక లేకపోవడంతో దేవాదాయశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీంతో ఆలయానికి వచ్చే కోట్లాది రూపాయల ఆదాయం కర్పూరంలా కరిగిపోతోందని భక్తులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. దేశంలోని నలుమూలల నుంచి ఆలయానికి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ప్రతిఏటా మే నెలలో ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల(జాతర) ద్వారా సంవత్సరానికి రూ.కోటికి పైగానే ఆదాయం వస్తోంది. అయినప్పటికీ అధికారుల లెక్కల ప్రకారం సంవత్సర నికర ఆదాయం రూ.87లక్షలుగా ఉంది. దేవాదాయశాఖ నిబంధనల మేరకు 2016లో 6ఏ టెంపుల్‌గా గుర్తింపు పొందిన ఆలయానికి గ్రేడ్ వన్ ఈఓ అధికారిగా కొనసాగుతున్నారు. ఆయనకు ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో మరికొన్ని ఆలయాలకు ఇన్‌చార్జ్‌గా కొనసాగుతుండటంతో ఆయన స్థానికంగా ఉండలేని పరిస్థితి.

సహాయ కమిషనర్‌కు నివేదిక పంపించాం



మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం 6ఏ టెంపుల్‌కు బదులుగా 6బి అని నమోదు కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాలకమండళ్ల ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు ఇచ్చిన దేవాలయాల్లో మల్లూరు దేవస్థానం పేరు రాలేదు. విషయాన్ని దేవాదాయశాఖ సహాయ కమిషనర్‌కు నివేదిక పంపించాం. దేవాదాయశాఖ ఆదేశాలు వచ్చిన వెంటనే ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేస్తాం.

– శ్రావణం సత్యనారాయణ, ఆలయ కార్యనిర్వాహణ అధికారి

మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలి

ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా



సమీక్షలో మాట్లాడుతున్న పీఓ చిత్రామిశ్రా

ఏటూరునాగారం: ఐటీడీఏ గిరిజన సంక్షేమ సంస్థల్లో ఆరోగ్యం, విద్య, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలపై అధికారులు దృష్టి సారించాలని పీఓ చిత్రామిశ్రా ఆదేశించారు. ఐటీడీఏలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం డిప్యూటీ డైరెక్టర్లు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ట్రైబల్ వెల్ఫేర్, డివిజనల్ మేనేజర్ జీసీసీ, గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్లు, అన్ని జిల్లాల అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో సంక్షేమ సంస్థల్లోని మౌలిక వసతులపై పీఓ సమీక్షించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని విద్యా సంస్థల్లోని కాంటింజెంట్ ఉద్యోగులు, జీతాలు, సీజనల్ వ్యాధులు, పారిశుద్ధ్యం హాజరు సమస్యలను పర్యవేక్షించాలన్నారు. ఇప్పటికే ఉన్న మరమ్మతు సమస్యలతో పాటు సంస్థల పాత్ర, మరమ్మతుల్లో ఉన్న ఆర్వో ప్లాంట్ల పనితీరు, విద్యార్థులకు యూనిఫాం కుట్టడం, బదిలీలు, పదోన్నతులపై సమీక్షించి గిరిజన సంక్షేమ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఏటూరునాగారం డిగ్రీ కళాశాల, బయ్యారం ఈఎంఆర్ఎస్, కొత్తగూడ ఎంఎస్, దామరవంచ డార్మెంటరీ, పర్వతగిరి ఆశ్రమ పాఠశాలల మరమ్మతుల పనుల స్థితిగతులపై జిల్లాల వారీగా సమీక్షించారు. అదనంగా సాధిరెడ్డిపల్లి, సీతానగర్, చిన్నబోయినపల్లి, కాటారం తదితర ప్రాంతాల్లో మరమ్మతు పనులు చేపట్టి వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ డైరెక్టర్లు, డీటీడబ్ల్యూఓలు, ఏటీడబ్ల్యూఓలు సంస్థలను క్రమం తప్పకుండా సందర్శించి ఆరోగ్యం, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలను పర్యవేక్షించి పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ డీడీలు వై.పోచం, వరంగల్ డీటీడబ్ల్యూఓ సౌజన్య, ఈఈ డి.వీరభద్రం, జీసీసీ డీఎం జి.ప్రతాప్‌రెడ్డి, గురుకులాల వరంగల్ ఆర్‌సీఓ జానునాయక్, ములుగు, భూపాలపల్లి, కొత్తగూడ ఏటీడబ్ల్యూఓలు దేశీరాం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ కేసులను గుర్తించాలి

- డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ములుగు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సమగ్ర సర్వైలైన్స్ ద్వారా లెప్రసీ కేసులను గుర్తించాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో లెప్రసీ నోడల్ పర్సన్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి డీఎంహెచ్‌ఓ హాజరై మాట్లాడారు. లెప్రసీ వ్యాధిగ్రస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్టు ఆఫీసర్ కామేశ్వర్‌రావు, ప్రోగ్రాం మెంబర్ నరసింహస్వామి, ప్రోగ్రాం అధికారి భవ్యశ్రీ, డీపీఎంఓలు సాంబయ్య, సంజీవరావు, హెల్త్ ఆఫీసర్ దుర్గారావు, ఎడ్యుకేటర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కవులు, రచయితల పుట్టినిల్లు జనగామ



కలెక్టరేట్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తిలకిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు కడియం, పల్లా, కలెక్టర్ రిజ్వాన్ బాషా, తదితరులు

పెంబర్తి హస్తకళా నైపుణ్యం అద్భుతం

- జనగామ జిల్లా పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం



పెంబర్తి కళాకారులు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పక్కన ఎమ్మెల్యే పల్లా, అధికారులు


జనగామ/జనగామ రూరల్: కవులు, రచయితలు, కళాకారులకు జనగామ పుట్టినిల్లు అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. గురువారం గవర్నర్ జిల్లాలో పర్యటించారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకోగా కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఘన స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం గవర్నర్.. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జనగామ మండలం పెంబర్తి మెటల్ హ్యాండీక్రాఫ్స్, బ్రాస్ వర్క్స్, చేనేత వస్త్రాలు, విజయ డెయిరీ స్టాల్స్‌ను సందర్శించారు. తర్వాత కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎంపీ కడియం కావ్య, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. కడియం గవర్నర్‌ను సత్కరించగా, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమున లింగయ్య కాకతీయ కళాతోరణం జ్ఞాపిక అందజేశారు. అంతకుముందు కలెక్టర్ జిల్లా బయోగ్రఫీని గవర్నర్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అదేవిధంగా ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో స్వామివారి కల్యాణంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్న తర్వాత ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో గవర్నర్ మాట్లాడుతూ జిల్లాలో రచయితలు, కవులు చాలా చురుకుగా ఉన్నారని.. దైనందన జీవితంలో సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగా అలవాటు చేసుకోవాలన్నారు. పెంబర్తి హస్తకళా నైపుణ్యం అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ స్కీం ద్వారా రూ.లక్ష సాయం చేయడంతో బాల్య వివాహాలు తగ్గాయని చెప్పారు. తెలంగాణలో ఎక్కువగా వాణిజ్య పంటలు వేయకపోవడానికి కోతుల బెడద కారణమన్నారు. ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ.. దేవాదుల రిజర్వాయర్ నిర్మాణం తర్వాత సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. రఘునాథపల్లి మండలం మండలగూడెంలో తాజా చేపలు దొరుకుతాయని చెప్పారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ డాక్టర్‌గా పనిచేస్తూ పార్లమెంట్‌లో అడుగుపెట్టడం సంతోషంగా ఉందని, ఇదే స్ఫూర్తితో అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నామన్నామని పేర్కొన్నారు. గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. యువత ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఓబుల్‌కేశ్వాపూర్‌ను రాబోయే రోజుల్లో కనీ వినీ ఎరగని స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. మన ఊరికి గవర్నర్ రావడం గర్వంగా ఉందని చెప్పారు. కవి, రచయిత అందెశ్రీ మాట్లాడుతూ.. తెలంగాణలో రాజకార్లకు వ్యతిరేఖంగా జరిగిన పోరాటంలో జనగామ–సిద్ధిపేటలోని బూరాన్‌పల్లి ముఖ్యభూమిక పోషించిందని అన్నారు. విప్లవాలకు ఈ గడ్డ పునాది రాయి, ఇంతటి ఘన చరిత్ర కలిగిన జనగామలోని పలు మండలాలను సిద్ధిపేటలో కలపడం బాధాకరమన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కూచిపూడి, భరత నాట్యంతోపాటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సంస్కృతీ సంప్రదాయాలను చాటిచెప్పేలా కళాకారులు అద్భుత ప్రదర్శన ఇచ్చారు. ఓబుల్‌కేశ్వాపూర్‌లో గవర్నర్ మొక్కనాటి నీరు పోశారు.

ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలి

వీసీలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దివాకర

ములుగు: పంచాయతీ ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి అధికారులను ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై అన్ని జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి వీడియో కాన్ఫరెన్స్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ తాడ్వాయి తహసీల్దార్ కార్యాలయం నుంచి జిల్లా తరఫున కలెక్టర్ దివాకర వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయతీలలో వార్డుల వారీగా 18సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పిస్తూ ఫొటోలతో కూడిన ఓటరు జాబితా తయారు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌లను తనిఖీ చేయడంతో పాటు మొదటి దశ బ్యాలెట్ బాక్సుల తరలింపునకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని గుర్తించి వివరాలు అందజేయాలన్నారు. రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులుగా విధులు నిర్వహించే వారికి శిక్షణ అందించేందుకు ప్రతీజిల్లా నుంచి 10మంది రిసోర్స్ పర్సన్‌లను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి శిక్షణకు పంపాలని సూచించారు. గ్రామపంచాయతీ ఎన్నికలు వివిధ దశలలో జరగనున్నందున బ్యాలెట్ పేపర్ల ముద్రణకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.

కేయూ 'లా' కళాశాలకు బీసీఐ అనుమతి

- మూడేళ్ల, ఐదేళ్ల కోర్సుల్లో ప్రవేశాలు
- ఈనెల 30 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం

కేయూ క్యాంపస్: హనుమకొండ సుబేదారిలోని కాకతీయ యూనివర్సిటీ 'లా' కళాశాలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) అఫ్లియేషన్ అనుమతినిచ్చింది. ఈ మేరకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి ఇచ్చిన ఉత్తర్వులు తమకు అందాయని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, యూనివర్సిటీ 'లా' కాలేజీ ప్రిన్సిపాల్ సుదర్శన్ గురువారం తెలిపారు. ఇటీవల బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతినిస్తూ విడుదల చేసిన 'లా' కళాశాలల జాబితాలో కాకతీయ యూనివర్సిటీ 'లా' కాలేజీ లేని విషయం విధితమే. ప్రధానంగా రెగ్యులర్ అధ్యాపకులు సరిపడా లేరనే కారణాలతో కేయూ 'లా' కాలేజీకి బీసీఐ అనుమతి నిరాకరించిన విషయం విధితమే. దీంతో కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి యూనివర్సిటీ 'లా' కాలేజీకి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి అనుమతి కోసం ప్రయత్నాలు చేశారు. చివరికి ఈనెల 28న అనుమతి ఇస్తున్నట్లు బీసీఐ నుంచి ఉత్తర్వులు గురువారం యూనివర్సిటీ రిజిస్ట్రార్, 'లా' కాలేజి ప్రిన్సిపాల్ అందాయి. 2024-2025 విద్యాసంవత్సరంలో మూడేళ్ల లాకోర్సుకు (60సీట్లు) ఐదేళ్ల లాకోర్సు (60సీట్లు) భర్తీకి అఫ్లియేషన్ అనుమతినిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో లాసెట్ కన్వీనర్ రమేశ్‌బాబు కాకతీయ యూనివర్సిటీ 'లా' కాలేజీ పేరును సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచి వెబ్ ఆప్షన్లకు కల్పించారు. అయితే రాష్ట్రంలో 'లా' కళాశాలల్లో ప్రవేశాలకు గాను ఇప్పటికే మొదటి దశ ప్రవేశాలకు తొలుత ఈనెల 27,28 తేదీల్లో అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారు. లాసెట్ ప్రవేశాలకు ఈవెబ్‌సైట్‌లో కేయూ 'లా' కాలేజీ గురువారం చేర్చినందున ఈనెల 30వరకు వెబ్ ఆప్షన్లకు గడువు ఇచ్చారు.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చినందున ఎలాంటి క్రయవిక్రయాలు జరగవని, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను తీసుకురావద్దని మార్కెట్ కమిటీ కార్యదర్శి పి.నిర్మల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న శనివారం వారాంతం యార్డు బంద్, 31 ఆదివారం, సెప్టెంబర్ 1న సోమవారం ఆమావాస్య ఉన్నందున మార్కెట్ బంద్ ఉంటుందని పేర్కొన్నారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

నాతోపాటు నలుగురికి ఉపాధి కల్పిస్తున్న..


టైలరింగ్ వర్క్ చేస్తున్న సఫీయా

మహబూబాబాద్ అర్బన్: మహిళా సంఘం ద్వారా నేను రూ. లక్ష రుణం తీసుకుని మానుకోట జిల్లా కేంద్రంలోని హన్మంతురావు స్తూపం సమీపంలో టైలరింగ్ షాపు ఏర్పాటు చేసుకున్న. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దుస్తులు కుడుతూ నాతోపాటు నలుగురికి ఉపాధి కల్పిస్తున్న. నా దగ్గర పనిచేస్తున్న మహిళలు గతంలో వివిధ కూలీ పనులకు వెళ్లేవారు. ప్రస్తుతం వారు ఆ పనులు మానేసి నా షాపులో పని చేస్తూ ఉపాధి పొందుతున్నారు. వచ్చిన ఆదాయంతో మొత్తం ఐదు కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయి. మా కుటుంబం ఆర్థికంగా మెరుగుపడింది. రానున్న రోజుల్లో ఈ చిన్న టైలరింగ్ షాపును పెద్ద పరిశ్రమగా మార్చి సుమారు 100 మందికి ఉపాధి కల్పించాలని నా కోరిక.

-సఫీయా, మహబూబాబాద్

స్వశక్తితో ఎదగడంతోపాటు ఐదుగురికి ఉపాధి..


బేకరీ నిర్వహిస్తున్న మాట్ల శ్రీనివాస్

టేకుమట్ల: ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి మండల కేంద్రానికి చెందిన మాట్ల శ్రీనివాస్. ఎమ్మెస్సీ బీఎడ్ పూర్తి చేశాక పీహెచ్‌డీ చేయాలనుకున్నాడు. తనకు వచ్చిన పీహెచ్‌డీ సీటును అధికారులు ఏదో కారణం చూపుతూ ఇతరులకు కేటాయించారు. దీంతో చేసేదేంలేక ఉద్యోగాలకు సన్నద్ధమవుతూనే కొంత కాలం మండల కేంద్రంలోని బేకరీలో పని నేర్చుకున్నారు. అనంతరం సొంతంగా మండల కేంద్రంతో పాటు మొగుళ్లపల్లి మండల కేంద్రంలో బేకరీ షాపులు నిర్వహిస్తున్నాడు. స్వశక్తితో ఎదగడంతోపాటు మరో ఐదుగురికి ఉపాధి కల్పిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఉద్యోగం లేకపోయినా ఉపాధితో ముందుకు సాగొచ్చని నిరూపిస్తున్నాడు.

మాట్ల శ్రీనివాస్, టేకుమట్ల

బేకరీ, హోంఫుడ్స్, పచ్చళ్లు తయారు చేస్తూ ..


హోంఫుడ్స్ తయారు చేస్తున్న లక్ష్మీసరస్వతి

ఖానాపురం: ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు అబ్బినేని లక్ష్మీసరస్వతి. ఈమెది ఖానాపురం మండల కేంద్రం. ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్‌లలో భాగంగా స్త్రీనిధి ద్వారా రూ.6 లక్షల రుణం తీసుకుంది. ఈ రుణంతో బేకరీతో పాటు హోంఫుడ్స్, పచ్చళ్లు తయారీ చేస్తోంది. హోంఫుడ్స్‌లో వివిధ రకాల వంటకాలు తయారీ చేసి విక్రయిస్తోంది. ఇతర దేశాల్లో ఉన్న వారికి సైతం పార్సిల్ ద్వారా పచ్చళ్లు పంపిస్తోంది. పచ్చళ్లు, హోంఫుడ్స్‌ను మండల కేంద్రంలోని రెండో బస్టాండ్ సెంటర్‌లోని బేకరి షాపులోనే తయారు చేస్తోంది. ముగ్గురు లేదా నలుగురు మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. జీవనోపాధి కోసం ఎంచుకున్న రంగంలో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది

స్వశక్తులు.. ఉపాధి కర్తలు

తాను ఎదగడంతోపాటు లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ స్వశక్తితో ముందుకెళ్తున్న ఔత్సాహికులు

ఒకరిపై ఆధారపడకుండా తనతోపాటు నలుగురికి ఉపాధి కల్పించాలని భావించే కొందరు.. చేస్తున్న ఉద్యోగం నచ్చక సొంత వ్యాపారం నిర్వహించుకోవాలని భావించే మరికొందరు.. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని చిన్నప్పటి నుంచే కలలు కనే ఇంకొందరి ఔత్సాహిలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనిస్తున్నాయి. ఔత్సాహికుల లక్ష్యాలను గుర్తించడంతోపాటు కార్మికుల జీవనోపాధికి భరోసా కల్పనలో భాగంగా వివిధ పథకాల రూపంలో లక్షలాది రూపాయాలు అందజేస్తున్నాయి. ఈ పథకాల ద్వారా ఆర్థిక చేయూత (రుణం) పొందుతున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని స్వశక్తితో ఎదగడంతోపాటు లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఈ క్రమంలో నేడు జాతీయ చిన్న పరిశ్రమల దినోత్సవం. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ పరిశ్రమల ఏర్పాటు, వివరాలు, ఉపాధి పొందుతున్న కార్మికులు, తదితర అంశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

- ఉమ్మడి వరంగల్‌లో సూక్ష్మ, చిన్న పరిశ్రమలే ఎక్కువ
- మొత్తం 75,874 పరిశ్రమల్లో 75,788 కంపెనీలు అవే
- నేడు చిన్న పరిశ్రమల దినోత్సవం



సాక్షి, వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లా.. సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు ఆలవాలంగా మారింది. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాలో కలిపి మొత్తం 75,874 పరిశ్రమలుంటే 74,363 సూక్ష్మ, 1425 చిన్న తరహా పరిశ్రమలు ఉన్నాయని 'ఉద్యమ్' పోర్టల్ అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. 86 మాత్రమే మధ్య తరహా పరిశ్రమలున్నట్లు వెల్లడించాయి. వీటిలో 13,143 మానుఫ్యాక్చరింగ్, 62,691 సర్వీసింగ్‌కు సంబంధించినవి పరిశ్రమలున్నాయి. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. కొందరు ఉద్యోగాలు మానేసి.. ఇంకొందరు పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ప్రభుత్వాలు ప్రోత్సాహకంగా అందిస్తున్న పథకాలను ఉపయోగించి రూ.లక్షలు రుణ సౌకర్యం పొంది పరిశ్రమలు ఏర్పాటు చేసి స్వయం శక్తితో ముందుకెళుతున్నారు.

జిల్లాల వారీగా పరిశ్రమలు ఇలా..

జిల్లా	మానుఫ్యాక్చరింగ్	సర్వీసింగ్	మొత్తం	మైక్రో	స్మాల్	మీడియం
హనుమకొండ	4,647	21,867	26,514	25,671	785	58
వరంగల్	3,214	15,762	18,976	18,734	231	11
జనగామ	2,264	7,335	9,599	9,466	129	4
మహబూబాబాద్	1,407	10,221	11,628	11,454	165	9
జయశంకర్	1,021	4,885	5,906	5,831	71	4
ములుగు	590	2,621	3,211	3,167	44	0

సొంత ఊరిలో ఉండడం ఆనందంగా ఉంది



సొంత రాష్ట్రంలో ఉపాధి లభిస్తుందని వచ్చి ఇక్కడ (మడికొండ) ఉపాధి పొందుతున్నాం. ఎక్కడో పని చేస్తూ కుటుంబానికి దూరంగా ఉండే కంటే కుటుంబంతో కలిసి ఉంటూ నాలుగు రూపాయలు సంపాదించుకుంటూ సొంత ఊరిలో ఉండడం ఆనందంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ఉపాధి అందించేలా చర్యలు తీసుకోవాలి

-దేవేందర్, చేనేత కార్మికుడు, మడికొండ

తెలంగాణ ఏర్పాటుతో సూరత్ నుంచి తిరిగొచ్చా



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి లభించక ఇబ్బందులు ఎదుర్కొన్న. ఉపాధి కోసం సూరత్ వెళ్లా. తెలంగాణ ఏర్పాటుతో స్వరాష్ట్రంలో ఉపాధి దొరుకుతుందని వచ్చా. కాజీపేట మండలం మడికొండ శివారులో టెక్స్ టైల్ పార్కులో ఓ పరిశ్రమ ఏర్పాటు చేసుకున్న. నాతో పాటు మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నందుకు సంతోషంగా ఉంది. వరంగల్ జిల్లాలో కాకతీయ వీవర్స్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు అనంతరం సూరత్ నుంచి కొంతమంది వచ్చి మడికొండలో 33 ఎకరాలలో 365 టెక్స్‌టైల్ యూనిట్లు ఏర్పాటు చేసుకున్నాం. ఉత్పత్తులు తయారు చేస్తూ మాతో పాటు కొంత మందికి ఉపాధి కల్పిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం టెక్స్ టైల్ కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలి.

-రాంచందర్,
మడికొండ టెక్స్‌టైల్ పార్కులోని ఓ పరిశ్రమ నిర్వాహకుడు,

తేజస్‌తో మరిన్ని పరిశ్రమలు..

పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు కొనుగోలు, ఉత్పత్తుల విక్రయంలో జాతీయ చిన్న తరహా పరిశ్రమల కార్పొరేషన్ (ఎన్‌ఎస్‌ఐసీ) సహకరిస్తోంది. జిల్లాల స్థాయిలో మరింత అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ఎంటర్ ప్రైనర్ జర్నీ ఫర్ యాస్పిరేషన్స్ అండ్ అచీవింగ్ సక్సెస్(తేజస్) కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ నిర్ణయాలతో జిల్లాల్లో ఈ పరిశ్రమల సంఖ్య భవిష్యత్‌లో మరింత పెరగనుంది. కోల్డ్ స్టోరేజీలు, గ్రానైట్, టెక్స్ టైల్ పరిశ్రమలు ఎక్కువగా వస్తున్నాయి. ఇప్పటికే కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కులో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల కోసం 182 ప్లాట్లు కేటాయించారు. వీటిలో 59 యూనిట్లు ఇప్పటికే టెక్స్ టైల్ రంగంలో పనిచేసిన వారికి కేటాయించారు.

-సోలమన్ రాజు ,
వరంగల్ జిల్లా పరిశ్రమల అధికారి

రుచికరమైన హోం ఫుడ్స్ డెలివరీ చేస్తున్నాం..


తమ సభ్యులతో కలిసి హోం ఫుడ్స్ తయారు చేస్తున్న బండారి శ్రీకళ

వరంగల్ అర్బన్: సమైక్య ద్వారా ఇందిర మహిళ శక్తి క్యాంటీన్ పేరుతో ముగ్గురం రూ.లక్ష రుణం తీసుకున్నాం. చకినాలు, లడ్డూలు, అర్శలతోపాటు క్యాటరింగ్ చేస్తున్నాం. మొదట్లో కొంత మేరకు ఇబ్బందులు ఎదురయ్యాయి. మారో ఆరుగురు మా సభ్యులను తీసుకున్నాం. మేం ఇప్పుడు అందరం సమిష్టిగా పనిచేస్తున్నారు. ఆర్డర్ చేస్తే లండన్, అమెరికా, ఇతర దేశాలకు హోం ఫుడ్స్ డెలివరీ చేస్తున్నాం. ఇలా ఖర్చులు అన్ని పోగా నెలకు ఒక్కొక్కరం రూ. 13వేల చొప్పన సంపాదించుకుంటున్నాం. మా కాళ్లపై మేమునిలబ డుతున్నాం.

-బండారి శ్రీకళ, రంగశాయిపేట గవిచర్ల క్రాస్

నెలకు రూ.30 వేలు సంపాదించుకుంటున్నాం


న్యాప్‌కిన్స్ తయారీలో పల్లె రజిని

న్యాప్‌కిన్ తయారీ కోసం కొద్ది రోజులు శిక్షణ తీసుకున్నాం. సుమారు ఆరుగురం రూ.3లక్షలతో న్యాప్‌కిన్ల తయారీకి పెట్టుబడి పెట్టాం. ఆదరణ ఉండడంతో నెలవారీ సంపాదన బాగానే ఉంది. రూ.30 వేలు సంపాదిస్తున్నాం. మెప్మా ప్రోత్సాహం ఉంది. వేడినీళ్లకు చన్నీల్లా మాదిరి కుటుంబంలో గర్వంగా జీవనం కొనసాగిస్తున్నాం.

-పల్లె రజిని, భీమారం

చికిత్స కోసం వస్తే ప్రాణం తీశారు..

- ఎన్ఎస్ఆర్ ఆస్పత్రిలో వైద్యం వికటించి రోగి మృతి
- ఆస్పత్రిలో కుటుంబ సభ్యుల ఆందోళన
- పోలీసుల రంగ ప్రవేశం.. సద్దుమణిగిన వివాదం


హరిప్రసాద్(ఫైల్)


అస్పత్రిలో ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

వరంగల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి చికిత్స చేయించుకునేందుకు పెద్ద పేరున్న ఆస్పత్రి అని వస్తే ప్రాణం పోయిందని రోగి కుటుంబ సభ్యులు రోదిస్తూ తెలిపారు. మృతుడి పెద్ద అల్లుడు కార్తీక్ తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన తేలుకుంట్ల హరిప్రసాద్(58) బైక్‌పై ఆదివారం రాత్రి ఓ బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లొస్తున్న క్రమంలో పందికుంట వద్ద ట్రాక్టర్ ఢీకొంది. దీంతో కాలికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హరిప్రసాద్‌ను చికిత్స నిమిత్తం జాతీయ రహదారి పక్కన కొత్తపేట క్రాస్‌పై ఉన్న ఎన్ఎస్ఆర్-అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. రోగిని పరిశీలించిన డాక్టర్లు కాలు చిద్రమైందని, ఆపరేషన్ చేయాలని అడ్మిట్ చేసుకుని వెంటనే డబ్బులు డిపాజిట్ చేయాలని చెప్పడంతో రూ.50వేలు అడ్వాన్స్ చెల్లించారు. మంగళవారం డాక్టర్లు కాలికి ఆపరేషన్ చేసి ఎముకలను సెట్ చేయగా, కాలులో రక్తం గడ్డ కట్టిన విషయం పట్టించుకోలేదు. దీంతో హరిప్రసాద్‌లో ఎలాంటి ఫలితం కనిపించలేదు. తిరిగి పరిశీలించిన డాక్టర్లు నరాల్లో ఇన్‌ఫెక్షన్ ఏర్పడిందని చెప్పి ఐసీయూలో పెట్టారని తెలిపారు. తిరిగి బుధవారం రీఆపరేషన్ నాలుగు చోట్ల చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని రాత్రి సమయంలో పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపినట్లు కార్తీక్ పేర్కొన్నాడు. చికిత్స కోసం ఆస్పత్రిలో రూ.50వేలు చెల్లించగా రూ.లక్షా 20వేల వరకు మందుల బిల్లులు చెల్లించామన్నారు. నిజానికి బుధవారం మధ్యాహ్నం మృతిచెందినట్లు తర్వాత తెలిసిందన్నారు. మృతదేహాన్ని సెల్లార్‌లో పెట్టి చికిత్స బిల్లు రూ.2లక్షల వరకు ఉందని, చెల్లించి తీసుకెళ్లాలని చెప్పడంతో కుటుంబీకులు డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే హరిప్రసాద్ మృతి చెందారని గురువారం ఉదయం నుంచి ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఏనుమాముల పోలీసులు ఆస్పత్రి వద్ద బందోబస్తు నిర్వహించారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఆందోళన జరిగింది. చివరకు కుటుంబీకులతో మామునూరు ఏసీపీ తిరుపతి, ఇన్‌స్పెక్టర్లు రాఘవేందర్, రవికుమార్, ఎస్సై రాజు, ఆసుపత్రి వర్గాలు చర్చలు జరపడంతో చికిత్సకు సంబంధించిన బిల్లులు మాఫీ చేయడంతోపాటు మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందించడంతో కథ సుఖాంతమైంది. ఈ విషయంపై ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌ను వివరణ కోరగా ఈ ఘటన ములుగు పీఎస్ పరిధిలో జరిగిందని, అ క్కడే కేసు నమోదైనట్లు తెలిపారు. ఆస్పత్రి నిర్వాహకులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

జ్వరంతో విద్యార్థి మృతి

- హసన్‌పర్తి పీఎస్ పరిధిలో ఘటన


నర్సింహారెడ్డి (ఫైల్)

హసన్‌పర్తి : జ్వరంతో బాధపడుతూ ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈఘటనపై మృతుడి తండ్రి హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ముల్కలపల్కి చెందిన అనుమాల రాంరెడ్డి కుమారుడు నర్సింహారెడ్డి(13) హసన్‌పర్తి మండలం ఎల్లాపురం శివారులోని ఆర్బిట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఇక్కడ హాస్టల్‌లోనే ఉంటూ చదువుతున్నాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున నర్సింహారెడ్డి అస్వస్థతకు గురయ్యాడు. పాఠశాల యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం చేరవేశారు. చికిత్స నిమిత్తం నర్సింహారెడ్డిని ఎంజీఎం తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా, బాలుడి మృతితో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగింది. మృతుడి తండ్రి రాంరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

ఘన్‌పూర్‌లో వ్యక్తి..


ఆంజనేయులు (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: విష జ్వరంతో బాధపడుతూ ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోని మాడల్‌కాలనీకి చెందిన కొరివి ఆంజనేయులు(48) గురువారం మృతిచెందాడు. ఆంజనేయులుకు మూడు రోజుల క్రితం విష జ్వరం రావడంతో జనగామలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగానే ప్లేట్‌లెట్స్ పడిపోయాయి. దీంతో పరిస్థితి విషమంగా ఉందని, హైదరాబాద్ నిమ్స్‌కు తరలించాలని వైద్యులు గురువారం సూచించారు. కాగా అంతలోనే ఏరియా ఆసుపత్రిలో మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

2025 డిసెంబర్ నాటికి 'దేవాదుల'

మొదటి ప్రాధాన్య క్రమంలో పూర్తికి ప్రభుత్వం నిర్ణయం

- అదనంగా 89,312 ఎకరాల ఆయకట్టు.. ఎనిమిది జిల్లాలకు ప్రయోజనం
- తుదిదశకు చేరుకున్న ఫేజ్-3 పనులు.. పూర్తయిన 20 పంపుహౌస్‌లు
- 2,947 ఎకరాల భూసేకరణకు గ్రీన్‌సిగ్నల్
- నేడు దేవాదుల పంపింగ్ స్టేషన్ వద్ద మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమీక్ష
- పాల్గొననున్న మంత్రులు పొంగులేటి, సీతక్క, సురేఖ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు

సాక్షి ప్రతినిధి, వరంగల్ : దేవాదుల ఎత్తిపోతల పథకం పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యంలో పెట్టింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం మేరకు నీటి పారుదల శాఖ పనులను వేగవంతం చేసింది. మొత్తం మూడు దశల్లో నిర్మాణం పూర్తి చేయాలనే ప్రణాళికతో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే భూ సేకరణతో సహా 91 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు పూర్తి చేసి 2025 డిసెంబర్ నాటికి 89,312 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే శుక్రవారం రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రాజెక్టు పురోగతిపై దేవాదుల ప్రాజెక్టు పంపింగ్ స్టేషన్ వద్ద నీటి పారుదల శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో సహా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, సీతక్క (అనసూయ), రాజ్యసభ, లోక్ సభ, శాసన మండలి, శాసన సభ్యులు పాల్గొననున్నారు. 2004- 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6016 కోట్ల అంచనా వ్యయంతో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టును కాలక్రమంలో ఫేజ్-2, ఫేజ్-3గా విస్తరించడంతో రూ.17,500 కోట్లకు పెరిగింది. ఇప్పటి వరకు రూ.14,188 కోట ఖర్చు చేశారు.

మొత్తం భూసేకరణ 33, 224 ఎకరాలుగా నిర్ణయించగా ఇప్పటివరకు 30, 268 ఎకరాలు సేకరించారు. మరో 2,957 ఎకరాల సేకరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొదటి దశలో 3 రిజర్వాయర్లు, 4 పంప్‌హౌస్‌ల ద్వారా 1.24 లక్షల ఎకరాల ఆయకట్టుకు 350 క్యూసెక్కుల నీరు అందించారు. అదే విధంగా రెండో దశలో 9 రిజర్వాయర్లు, 7 పంప్ హౌస్‌ల ద్వారా లక్షా 93 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించారు. కాగా, తుది దశకు చేరుకున్న మూడో దశ పూర్తయితే 2,40,000 ఎకరాల ఆయకట్టుకు 10 పంప్ హౌస్‌ల ద్వారా 1750 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మల్టీ స్టోరేజీ ఎత్తిపోతల పథకంగా పేరొందిన ఈ ప్రాజెక్టులో గోదావరి నీటి మట్టం నుంచి 469 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తి పోయనున్నారు. మొత్తం 39.16 టీఎంసీల నీటిని ప్రతి సంవత్సరం 170 రోజులు నీటిని ఎత్తిపోయనున్నారు. కాగా, ఫేజ్-1, ఫేజ్-2తోపాటు ఫేజ్-3కి మొత్తం 499 మెగావాట్ల విద్యుత్‌ను ఉపయోగించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAUNCHING OFFER (Limited Period)
వరంగల్ హైవే భువనగిరి దగ్గరలో దండుపట్ల గ్రామంలో మా యొక్క నూతన వెంచర్ ప్రారంభోత్సవ కానుకగా 121 గజాల Farm Land కేవలం 10 లక్షలకే తీసుకోండి మరియు అదనంగా 20,000/-లను 24 నెలల వరకు రెంటల్‌ను పొందే గొప్ప అవకాశం త్వరపడండి
Free and Spot Registration
9440958008

PLOT FOR SALE

- HNK, KITS College అంబాల రోడ్డు & ముచ్చర్ల రోడ్డు కొత్తగా వస్తున్న హైవే రోడ్డు దగ్గరలో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మబడును. సంప్ర॥ 9553255936. [W-1239955]

WANTED

- PHARMACY BOYS, OPERATION Theater Boys & Receptionists / సిస్టమ్ ఆపరేటర్స్ కావలెను. సంప్ర॥ గార్డియన్ హాస్పిటల్, ములుగు "X" రోడ్, వరంగల్ 12 to 2 PM. [WA-0420]
- ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థలో పని చేయుటకు ములుగు, భూపాలపల్లి జిల్లాలో రియల్ ఎస్టేట్ ఏజెంట్లు కావలెను. రిటైర్డ్ ఉద్యోగులు, గృహిణులు, LIC ఏజెంట్లకు సదావకాశం. ఆకర్షణీయమైన జీతం. 7416975767, 8978118889. [WA-584]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/-
అదనపు లైను రూ॥ 60/- మాత్రమే
5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.